కూటమిలో కొట్లాట



- జమ్మలమడుగులో ఆది వర్సెస్ సీఎం రమేశ్
- కడప టీడీపీలో అసమ్మతి సెగలు
- రోడ్డెక్కిన బీజేపీ, టీడీపీ శ్రేణులు

(కడప-ఆంధ్రజ్యోతి): కేంద్రం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. రాష్ట్రంతో పాటు జిల్లా అభివృద్ధి బాటలో పయనిస్తోంది. మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి కడప జిల్లాలో ఏడు అసెంబ్లీ సీట్లను టీడీపీ, బీజేపీ, జనసేన గెలుచుకున్నాయి. నిన్న జరిగిన పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూడా కూటమిలోని టీడీపీ గెలుచుకుని తిరుగులేని జోష్‌లో ఉంది. రాజకీయంగా జగన్‌కు సొంత జిల్లాలోనే కూటమి ఝలక్ ఇస్తూ ముప్పుతిప్పలు పెడుతూ వస్తుంది. అదే సమయంలో కూటమిలో కొట్లాటలు జరగడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. టీడీపీ-బీజేపీ, బీజేపీ-జనసేన, టీడీపీ-జనసేన నేతల మధ్య భేదాభిప్రాయాలు వచ్చాయంటే ఏమో అనుకోవచ్చు. అలా కాకుండా బీజేపీ సొంత పార్టీ నేతల మధ్య.. టీడీపీలో సొంత నేతల మధ్య కొట్లాటలు జరగడం జిల్లాలో సంచలనంగా మారింది.

జమ్మలమడుగులో నువ్వా నేనా

జమ్మలమడుగు నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, పోట్లదుర్తికి చెందిన అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ మధ్య కొద్దిరోజులుగా వార్ కొనసాగుతోంది. ఇద్దరూ బీజేపీలో కీలక నేతలు. ఒకప్పుడు వీరిద్దరూ మంచి దోస్తులుగా ఉండేవారు. ఎక్కడ చెడిందో కానీ ఈసారి మాత్రం ఇద్దరూ ప్రత్యర్థుల్లా మారి ఆధిపత్యం కోసం ఆరాటపడుతున్నారు. గ్రాండ్ కెనాన్‌గా గండికోట లోయ గుర్తింపు పొందింది. దీనిని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అక్కడ మౌలిక వసతుల కోసం ప్రభుత్వం రూ.70కోట్లు కేటాయించింది. ఇటీవల టెండర్లు పిలవగా సీఎం రమేశ్‌కు చెందిన రిత్విక్ సంస్థ కాంట్రాక్టు దక్కించుకుని పనులు చేపడుతోంది. అయితే సోమవారం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వర్గీయులు 50 మందికి పైగా గండికోటలో ఉన్న రిత్విక్ కార్యాలయంపై దాడి చేయడం చర్చనీయాంశంగా మారింది. గండికోట గ్రామంలో తాగునీరు ఇతర మౌలిక వసతులు కల్పించకపోవడంతో దాడికి పాల్పడినట్లు చెబుతున్నప్పటికీ అసలు విషయం మాత్రం ఇద్దరి మధ్య ఆర్థిక అంశాలే కారణమని తెలుస్తోంది. జమ్మలమడుగు ఫ్యాక్షన్ ఏరియా. ఎవరు అధికారంలో ఉంటే ఆ ప్రాంతం వారి సామంతరాజ్యంగా భావిస్తారు. అక్కడ ఏ పనులు చేయాలన్నా కప్పం కట్టాలనే ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో ఇటీవల అక్కడ గొడవలు ఎక్కువగా సాగుతున్నాయి.

మైలవరం మండలంలో అదాని కంపెనీకి హైడ్రోపంప్డ్ స్టోరేజీ పవర్‌ప్రాజెక్టు వచ్చింది. ఈ పనులను సబ్ కాంట్రాక్టరుగా సీఎం రమేశ్‌కు చెందిన రిత్విక్ చేపట్టింది. అప్పట్లో కూడా ఎమ్మెల్యే ఆది వర్గీయులు ఆ ప్రాజెక్టు కార్యాలయంపై దాడులు చేశారు. స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని అడిగామే తప్ప దాడి చేయలేదంటూ చెప్పుకొచ్చారు. ఇక ఆర్టీపీపీలో బూడిద విషయంలో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆది మధ్య పెద్ద గొడవే సాగింది. అది రాష్ట్రంలోనే అప్పట్లో పెద్ద ఇష్యూగా మారింది. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మంచి రాజకీయ వ్యూహకర్తగా పేరొందారు. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కీరోల్ పోషించారు. ఆ ఎన్నికల్లో ఎంపీ సీఎం రమేశ్ కూడా తన వంతు పాత్ర పోషించారు. అప్పట్లో అందరూ కలిసి పనిచేశారు. అయితే ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

కడపలో అసమ్మతి సెగలు

కడప తెలుగుదేశం పార్టీలో అసమ్మతి సెగలు రాజుకున్నాయి. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డికి అత్యంత సన్నిహితుడుగా నమ్మకస్తుడుగా పాతకడపకు చెందిన కృష్ణారెడ్డికి పేరుంది. అటువంటి ఆయన ఎమ్మెల్యే మాధవీకి వ్యతిరేకంగా ఓ బ్యాచ్‌ను కూడగట్టి దేవునికడపలో పూజలు చేసి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తానరసింహారెడ్డిని కలవడం పెద్ద చర్చనీయాంశంగా మారింది. కడప టీడీపీలో ఎమ్మెల్యేకు ఆ పార్టీలోని కొందరు నేతలకు మధ్య చాలా గ్యాప్ వచ్చింది. మాజీ టీడీపీ ఇన్‌చార్జి వీఎస్ అమీర్ బాబు, అలంఖాన్‌పల్లెకు చెందిన లక్ష్మిరెడ్డి, టీడీపీ నగరాధ్యక్షుడుగా పనిచేసిన సానపురెడ్డి శివకొండారెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.హరిప్రసాద్‌తో పాటు మరికొందరు ఎమ్మెల్యేకు దూరంగా ఉంటున్నారు. ఎన్నికల్లో సహకరించలేదని, తాను ఓడిపోవాలని పనిచేశారని ఎమ్మెల్యే మాధవి కొందరు నేతలపై గుర్రుమంటూ వచ్చారు. అలాంటి వారిని దూరం పెట్టారని ఎమ్మెల్యే వర్గీయులు అంటున్నారు. అయితే ఆర్.శ్రీనివాసరెడ్డికి ముఖ్యఅనుచరుడుగా పేరొందిన కృష్ణారెడ్డి తిరుగుబాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇతను శ్రీనివాసరెడ్డికి అత్యంత ఆప్తుడుగా ఉండేవాడు. రేషన్‌షాపు డీలర్లు, గ్రావెల్ ఇతరత్రా పనుల్లో ఇతనిపై ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇతనికి కొద్దిరోజులుగా ప్రాధాన్యత తగ్గిస్తూ వచ్చారని సమాచారం. దీంతో ఈయన కొంతమంది పార్టీ నేతల భరోసాతో తిరుగుబాటు చేశారనే చర్చ నడుస్తోంది. ఇటీవల బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడుతూ.. తమకు ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ కడప టీడీపీ నేతలపై ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. మొత్తానికి కూటమి నేతల మధ్య కొట్లాట జరుగుతుండడంపై జిల్లాలో పెద్ద చర్చ నడుస్తోంది. చంద్రబాబునాయుడు నేతృత్వంలో ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో ముందుకు తీసుకెళుతోంది. ఈ నేపథ్యంలో కూటమి నేతలు ప్రభుత్వానికి మైలేజీ కావాల్సింది పోయి డ్యామేజీగా వ్యవహరించడం కూటమిలోని హార్డ్‌కోర్ ఫ్యాన్స్ జీర్ణించుకోలేకున్నారు.

పాలకొండ్రాయుడుకు అసెంబ్లీ ఘన నివాళి



అసెంబ్లీలో పాలకొండ్రాయుడు మృతికి సంతాపం తెలుపుతున్న ఎమ్మెల్యేలు

రాయచోటి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడుకు రాష్ట్ర అసెంబ్లీ మంగళవారం ఘన నివాళి అర్పించింది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా పలువురు తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, క్రియాశీల నాయకులు మృతిచెందిన విషయం తెలిసిందే. వీళ్లందరికీ మంగళవారం అసెంబ్లీ సంతాపం తెలిపింది. స్పీకర్ అయ్యన్నపాత్రుడు సంతాపం తెలియజేస్తూ.. 1978లో పాలకొండ్రాయుడు జనతా పార్టీ తరఫున శాసనసభకు ఎన్నికైన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. 1983లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ గాలి బలంగా వీచినా స్వతంత్ర అభ్యర్థిగా పాలకొండ్రాయుడు గెలుపొందారని, 1989లో టీడీపీ నుంచి ఎంపీగా, 1999, 2004లో ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్ర అభివృద్ధికి, శాసనసభ ఔన్నత్యం కాపాడేందుకు కృషి చేశారని కొనియాడారు. తమతో పాటు ఎన్నికై శాసనసభలో ప్రజాసమస్యల పట్ల అంకితభావంతో పనిచేశారని పేర్కొన్నారు. ఈ ఏడాది మే 6న ఆయన చనిపోయారని, అటువంటి నాయకుడు మృతి చెందడం పేద ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. అనంతరం అసెంబ్లీలో ఎమ్మెల్యేలు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి సంతాపం తెలిపారు.

మేయర్‌పై వేటు



- సురేశ్‌బాబును పదవినుంచి తొలగించిన ప్రభుత్వం
- నిబంధనలకు విరుద్ధంగా పనులు చేసిన వైనం

(కడప-ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, నగర మేయర్ సురేశ్‌బాబు మధ్య జరిగిన కుర్చీ పోరు ఎట్టకేలకు ముగిసింది. సురేశ్‌బాబును మేయర్ పదవి నుంచి తొలగిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

జీహెచ్‌ఎంసీ యాక్ట్ ప్రకారం కార్పొరేషన్ మేయర్, మున్సిపాలిటీ చైర్మన్‌లు వారి కుటుంబ సభ్యులకు లబ్ధి చేకూరేవిధంగా ఎలాంటి కాంట్రాక్టు పనులు చేపట్టకూడదు. అయితే కడప మేయర్ సురేశ్‌బాబు తన సతీమణి కొమ్మద్ది జయశ్రీ, కుమారుడు అమర్ పేర్లతో ఉన్న వర్ధిని కన్‌స్ట్రక్షన్ పేరిట కడపలో పలు కాంట్రాక్టు పనులు చేపట్టారు. అప్పట్లో వైసీపీ అధికారంలో ఉండడం, కార్పొరేషన్ పాలకవర్గం వైసీపీ చేతిలో ఉండటంతో వారు ఆడింది ఆటగా పాడింది పాటగా సాగింది. సురేశ్‌బాబు నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలడంతో ఆయనను మేయరు పదవి నుంచి తొలగిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జీవో ఆర్టీ నెంబర్ 1016ను మంగళవారం జారీచేసింది. ఈ విషయంపై సురేశ్‌బాబును వివరణ కోరేందుకు ఆంధ్రజ్యోతి ప్రయత్నించగా ఆయన ఫోను లిఫ్ట్ చేయలేదు.

కుర్చీ కోసం ఎమ్మెల్యే వర్సెస్ మేయర్

కడప కార్పొరేషన్ పాలకవర్గం వైసీపీ చేతిలో ఉంది. 50 మంది కార్పొరేటర్లు ఉంటే సైకిలు గుర్తుపై కేవలం అలంఖాన్‌పల్లెకు చెందిన ఉమాదేవి ఒక్కరు మాత్రమే గెలిచారు. కార్పొరేషన్ ఇటు కడప అటు కమలాపురం నియోజకవర్గాల పరిధిలో ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక జరిగిన తొలి సమావేశానికి కడప, కమలాపురం ఎమ్మెల్యేలు ఆర్.మాధవి, చైతన్యరెడ్డి హాజరయ్యారు. అప్పట్లో మేయర్ పక్కనే ఎమ్మెల్యేలకు సీట్లు కేటాయించారు. తరువాత సమావేశాలకు మేయర్ సురేశ్‌బాబు నిబంధనల పేరుతో వేదికపై కేవలం మేయర్, కమిషనర్‌కు మాత్రమే కుర్చీలు ఏర్పాటు చేశారు. ఇది ఎమ్మెల్యే మాధవికి ఆగ్రహం తెప్పించింది. అంతకు ముందు మూడేళ్ల పాటు జరిగిన ప్రతి సమావేశంలో మేయరు పక్కనే ఎమ్మెల్యేలకు సీట్లు కేటాయించారు. ఇప్పుడు తనకు సీటు వేయకపోవడంపై ఆగ్రహిస్తూ ఆమె మీటింగులో పెద్ద ఫైటే చేశారు. మేయర్‌కు సీటే లేకుండా చేస్తానని శపథం చేశారు. ఈ మేరకు మేయర్ సురేశ్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన అక్రమాలపై ఫోకస్ చేశారు. జీహెచ్‌ఎంసీ యాక్టుకు విరుద్ధంగా సురేశ్‌బాబు కుటుంబసభ్యులతో పనులు చేసి లబ్ధి పొందినట్లు గుర్తించి ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీనిపై విజిలెన్స్ విచారణ చేపట్టి వాస్తవమని తేలడంతో సురేశ్‌బాబుపై వేటు పడింది. కాగా.. జనవరిలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే ఇప్పుడున్న స్థానిక సంస్థల ప్రతినిధులకు పదవీ కాలం దాదాపు ముగిసినట్లే. ఈ సమయంలో సురేశ్‌బాబుపై వేటు పడడం చర్చనీయాంశంగా మారింది.

గండికోటలో పూర్తిస్థాయి నీటిమట్టం



పూర్తిస్థాయి నీటిమట్టంతో కళకళలాడుతున్న గండికోట ప్రాజెక్టు

కొండాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు మంగళవారం ఉదయం పూర్తిస్థాయి నీటిమట్టం 26.85 టీఎంసీలకు చేరుకుంది. 2021 నుంచి వరుసగా ఆరేళ్లుగా ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టంతో ఈ ఏడాది కూడా అరుదైన ఘనత సాధించింది. పూర్తిస్థాయి నీటిమట్టం చేరుకోవడంతో మైలవరం జలాశయానికి 1000 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి అవుకు రిజర్వాయర్ నుంచి వరదకాలువ ద్వారా వచ్చే కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 1,450 క్యూసెక్కులు వస్తోందన్నారు. గండికోట నుంచి సీబీఆర్‌కు 500 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామని ఈఈ తెలిపారు.

భక్తజనహృదయినీ.. భవానీ



కడప అమ్మవారిశాలలో కన్యకాపరమేశ్వరి అలంకారం


ప్రొద్దుటూరు టౌన్ / కడప కల్చరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు మంగళవారం జిల్లా వ్యాప్తంగా అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలుచోట్ల అమ్మవారి భారీ సెట్టింగులు వేసి శోభాయమానంగా అలంకరించారు. అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ప్రొద్దుటూరు వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో, రతనాల వెంకటేశ్వర ఆలయంలో, శాస్త్రినగర్‌లో రాజరాజేశ్వరీదేవి ఆలయంలో, ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు భవానీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కడప నగరం రాజంపేట రోడ్డులోని లలితాపంచాయతన దేవాలయంలో జగన్మాత రెండో రోజు బాలా త్రిపురసుందరీదేవిగా కొలువుదీరారు. బిల్టప్ సమీప విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు బ్రహ్మచారిణి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు, చండీహోమాలు నిర్వహించారు. కడప నగరంలోని అమ్మవారిశాలవీధిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులను కరుణించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. రాజరాజేశ్వరిదేవి ఆలయంలో మంగళగౌరీ దేవిగా, ఎర్రముక్కపల్లెలోని చౌడేశ్వరిదేవి బాలా త్రిపురసుందరీదేవిగా భక్తులను కరుణించారు.



ప్రొద్దుటూరు రాజరాజేశ్వరీదేవి ఆలయంలో భవానీదేవిగా..



కడప అమ్మవారిశాలలో భక్తుల రద్దీ



ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో భవానీదేవిగా అమ్మవారు



బ్రహ్మచారిణిగా విజయదుర్గాదేవి


అసభ్య పోస్టులు పెట్టొద్దు

- అలా చేస్తే ఎంతటి వారైనా అరెస్టు చేస్తాం
- మీడియా సమావేశంలో ఎస్పీ నచికేత్ విశ్వనాథ్



కడప క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టే పోస్టులు, అసభ్యకర వ్యాఖ్యలు, అసభ్యకర పోస్టులు పెడితే వారు ఎంతటివారైనా సరే.. కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తామని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ హెచ్చరించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. న్యాయవ్యవస్థపై సోషల్ మీడియాలో పలు పోస్టులు పెట్టిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఇప్పటికే పలు ఫిర్యాదులపై జిల్లాలో కేసులు నమోదు చేశామన్నారు. సోషల్ మీడియాలో మహిళలు, బాలికల పట్ల అసభ్యకర రీతిలో పోస్టులు పెట్టినా.. కులాలు, వర్గాలు, వ్యక్తిగత దూషణలు, రెచ్చగొట్టే పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో సోషల్ మీడియా పోస్టులపై గట్టి నిఘా ఉంచామని వాటిపై ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నామని తెలిపారు. యువత సోషల్ మీడియాను మంచి కోసమే వినియోగించాలన్నారు. ఎవరైనా వ్యక్తిగత దూషణలతో లేదా కామెంట్స్‌బాక్స్‌లో అనుచితమైన వ్యాఖ్యలు చేసినా పోస్టులు పెట్టినట్లు గుర్తిస్తే వెంటనే పోలీసు శాఖ సోషల్ మీడియా ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జ్బుచ్ఛీఖ్ఠిఇౌజ్టూజీఛ్చిటౌ ఛిజ్చీజూఠ్చుఛీజ్చీః జఝ్చుజీజ్టూ.ఛౌఝ లేదా వాట్సప్ నెంబర్ 9121100686కు ఫిర్యాదు చేయాలని కోరారు.

ప్యానెల్ కమిటీ స్పీకర్‌గా వరదరాజులరెడ్డి



ప్రొద్దుటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ప్యానెల్ కమిటీ స్పీకర్‌గా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని ప్రకటించారు. శాసనసభలో డిప్యూటీ స్పీకర్ అందుబాటులో లేనప్పుడు ప్యానల్ స్పీకర్‌గా సభ నిర్వహించాల్సి ఉంటుంది. ఈ గౌరవ హోదా కల్పించడంపై ప్రొద్దుటూరు టీడీపీ నేతలు బచ్చల పుల్లయ్య, ఆసం రఘురామిరెడ్డి, ఈవీ సుధాకర్ రెడ్డి, ముక్తియార్, ఘంటశాల వెంకటేశ్వర్లు తోట మహేశ్వరరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

2 నాటికి స్మార్ట్ కిచెన్లు సిద్ధం చేయాలి

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్ల నిర్మాణాలను అన్ని మండలాల్లో అక్టోబరు 2 నాటికి పూర్తి చేసి నిర్వహణలోకి తీసుకురావాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ నిర్మాణాల పురోగతిపై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలసి సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా రూపుదిద్దుకోనున్న స్మార్ట్ కిచెన్ షెడ్ నిర్మాణాలు అన్ని మండలాల్లో ఒకే డిజైన్‌తో ఉండాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే నగరంలో మున్సిపల్ హైస్కూల్ (మెయిన్)లో ఏర్పాటు చేసిన కిచెన్ రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. అదే స్ఫూర్తితో అన్ని మండలాల్లో స్మార్ట్‌కిచెన్ షెడ్ల ఏర్పాటు చేయాలన్నారు. ఈ ప్రక్రియ అంతా అక్టోబరు 2 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీపీవో హజరత్తయ్య, స్మార్ట్ కిచెన్స్ పర్యవేక్షకులు జోయల్ విజయ్‌కుమార్, ఏపీఐఐసీ జెడ్ఎం శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

టీడీపీ కడప నగర కమిటీ ఎంపిక



పఠాన్ మన్సూర్ అలీఖాన్

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కడప నగర కమిటీని శుక్రవారం ఎంపిక చేశారు. నగర అధ్యక్షుడిగా పఠాన్ మన్సూర్‌అలీ ఖాన్, ఉపాధ్యక్షుడిగా పసుపులేటి గౌతం కుమార్ ఎంపికయ్యారు. నగర ప్రధాన కార్యదర్శిగా ముక్కర సుబ్బారెడ్డి, కార్యవర్గ కార్యదర్శులుగా బోనం శిలాస్, బాబా ఫక్రుద్దీన్, పూర్ణచంద్రరావు, కార్యదర్శులుగా వెంకటేశ్ ఆచారి, శ్రీనివాసులు, నరేశ్, కోశాధికారిగా ఎం.చంద్రశేఖర్‌రెడ్డి ఎంపికయ్యారు. వీరిని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి సన్మానించారు. పార్టీ బలోపేతం కోసం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యాటగిరి రాంప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఏఐ 2.0 లక్ష్యాలను సాధించాలి




మాట్లాడుతున్న జడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య యాదవ్

కడపరూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పంచాయతీ పురోగతి సూచిక (పీఏఐ) 2.0 లక్ష్యాలను సాధించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని జడ్పీ వైస్ చైర్మన్ పిట్టు బాలయ్య యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో పీఏఐ-2.0పై జడ్పీటీసీలకు, ఎంపీడీవోలకు, అనుబంధశాఖల అధికారులకు ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించారు. జడ్పీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ రూపొందించిన పంచాయతీ పురోగతి సూచిక-2.0 ప్రకారం ప్రతి గ్రామ పంచాయతీలో ప్రధానమైన 9 అంశాలపై పూర్తి స్థాయి అభివృద్ధి సాధించేందుకు అధికారులతో ప్రజాప్రతినిధు లు సమన్వయంతో పనిచేస్తారన్నారు. జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీని పేదరికంలేని పంచాయతీగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యసాధనకు ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. అన్ని వయసుల వారికి ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించాలన్నారు. డీపీవో రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో నాణ్యమైన నీటి సరఫరా, మంచినీటి నిర్వహణ ఉండాలన్నారు. వ్యవసాయం, ఇతర అన్ని అవసరాలకు సమృద్ధిగా నీటి లభ్యత చేకూర్చాలన్నారు. జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్రహ్మణ్యం, కడప డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మైథిలీ మాట్లాడారు.

యూసీఐఎల్ సమస్యలు పరిష్కరించండి

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): యూసీఐఎల్ సమస్యలు పరిష్కరించి పర్యావరణ సహితంగా ప్రాజెక్టును నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో తుమ్మలపల్లి యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (యూసీఐఎల్) సమస్యలపై ప్రాజెక్టు అధికారులు, పులివెందుల డివిజన్ రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూసీఐఎల్ ప్రాజెక్టులో ఎలాంటి భూ, ఇతర సమస్యలు తలెత్తకుండా పరిష్కరించాలని పులివెందుల ఆర్డీవోను ఆదేశించారు. ప్రాజెక్టు పరిధిలో పునరావాసం కోరుతున్న జేకొట్టాల గ్రామ ప్రజలు, రైతులతో మాట్లాడి సమస్యలు సామరస్యంగా పరిష్కరించాలన్నారు. గతంలో ఈ ప్రాజెక్టు కోసం మంజూరైన భూములను త్వరితగతిన వారికి అప్పజెప్పాలన్నారు. ప్రాజెక్టు నిర్వహహణ, భద్రతా పరమైన అంశాలలో ఎలాంటి అలసత్వం తగదన్నారు. యురేనియం గనుల వల్ల పరిసర గ్రామాలు ప్రభావితం కాకుండా చూడాలన్నారు. టెయిలింగ్ పాండ్‌లో వ్యర్థ పదార్థాల నిల్వలు, స్టోరేజ్ సామర్థ్యం వంటి అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో యూసీఐఎల్ మేనేజరు సుమన్ సర్కార్, సూపరింటెండెంట్ నవీన్ రెడ్డి, ఆర్డీవో చిన్నయ్య, ఆర్‌అండ్‌బి డీఈ మాధవి పాల్గొన్నారు.

జగనన్న ఖాళీలు

వైసీపీ హయాంలో జగనన్న నవరత్నాలలో భాగంగా ఇబ్బడిముబ్బడిగా ఇళ్ల స్థలాలు కేటాయించారు. గ్రామాలు, పట్టణాలకు సుదూర ప్రాంతాల్లో రాళ్లు, గుట్టలు, కుంట స్థలాల్లో జగనన్న లేఅవుట్లు వేసి దరఖాస్తు చేసిన వారందరికీ ఒకటిన్నర సెంటు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించారు. నివాసయోగ్యం కాని ఈ స్థలాల్లో పట్టా పొందినా.. ఇంటి నిర్మాణాలు చేయలేక కొందరు, అనాసక్తితో ఇంకొందరు ఐదేళ్లు అయినా వాటిని పట్టించుకోలేదు. దీంతో జిల్లాలో వందలాది ఎకరాలు బీడు భూములను తలపిస్తున్నాయి.



- బీళ్లుగా జగనన్న కాలనీలు ● జిల్లాలో 602 ఎకరాలు ఖాళీ
- ఎంఎస్ఎంఈలకు కేటాయించేందుకు ప్రభుత్వం సన్నాహాలు
- లబ్ధిదారులకు మరోచోట ఇళ్ల స్థలాలు



మదనపల్లె మండలం పోతబోలు హౌసింగ్ కాలనీలో ఖాళీగా ఉన్న ఇళ్ల స్థలాలు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో అడిగిన వారందరికీ నవరత్నాల పథకం కింద దరఖాస్తు చేసిన 90 రోజుల్లోనే ఇంటి పట్టాలు ఇవ్వాలని రెవెన్యూ అధికారులపై ఒత్తిడి పెంచారు. దీంతో రెవెన్యూ అధికారులు గ్రామాలు, పట్టణాలకు దూరంగా ఉన్న ప్రభుత్వ స్థలాలు, ప్రైవేటు స్థలాలను సేకరించి జగనన్న ఇళ్ల లేఅవుట్‌లు వేసి, అందులో లబ్ధిదారులకు ఇంటి పట్టాలు మంజూరు చేశారు. చాలా వరకు గుట్టలు, రాళ్లరప్పలు, కుంటలు ఉండే ప్రాంతాల్లోనే లేఅవుట్‌లు వేసి ఇచ్చారు. నివాసయోగ్యం కాని ఈ స్థలాలు తమకు వద్దంటూ అప్పట్లోనే లబ్ధిదారులు రోడ్డెక్కి నిరసనలు కూడా తెలిపారు. అన్నమయ్య జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్లలో 500 గ్రామ పంచాయతీల్లో మొత్తం 487 లేఅవుట్లు వేశారు. ఇందులో 57,618 మందికి ఇంటి పట్టాలు మంజూరు చేశారు. వాస్తవంగా లబ్ధిదారులు అష్టకష్టాలు పడి వారికి కేటాయించిన ఒకటిన్నర సెంటు స్థలాల్లో అప్పులు చేసి పునాదులు, లింటెల్‌లెవెల్, మోల్డింగ్ దశల వరకు కొందరు ఇళ్లను నిర్మించుకున్నారు. కొందరు ఇంటి నిర్మాణాలు పూర్తి చేసి ఇళ్లలోకి చేరారు. ఇలా పునాదుల నుంచి ఇంటి నిర్మాణాలు పూర్తిచేసుకున్న వారి సంఖ్య 33,448 మాత్రమే. మిగిలిన 24,170 మందికి కేటాయించిన ఇళ్ల స్థలాలు ఖాళీగానే ఉన్నాయి. అంటే ఒక్కో లబ్ధిదారుడికి ఒకటిన్నర సెంటు ఇంటి స్థలం చొప్పున 24,170 మందికి కేటాయించిన 36,255 సెంట్లు అంటే 362.55 ఎకరాలు హౌసింగ్ కాలనీల్లో ఖాళీగా వెక్కిరిస్తూ కనిపిస్తూ ఉన్నాయి.

ఎంఎస్ఎంఈలకు స్థలాలు

విజయవాడలో ఈనెల 15, 16 తేదీల్లో నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు సరికొత్త నిర్ణయాలు తీసుకున్నారు. వైసీపీ పాలనలో తీసుకుని సరిగా అమలుకాని నిర్ణయాలను మార్చి భవిష్యత్ ఉపయోగాలకు, ఆర్థికంగా ఎదిగేందుకు విధి, విధానాలను రూపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా జగనన్న లేఅవుట్లలో నివాసయోగ్యం కాని ఇళ్ల స్థలాలు, పునాదులు కూడా నిర్మించకుండా మిగిలిపోయిన ఇళ్ల స్థలాలను గుర్తించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇందులో భాగంగా ఇంటి పట్టా పొందిన లబ్ధిదారుడి అనుమతితో ఆ స్థలాలను వెనక్కి తీసుకుని, ఖాళీ స్థలాలను కుటీర, చిన్న పరిశ్రమలశాఖ(ఎంఎస్ఎంఈ)లకు కేటాయించాలని చంద్రబాబు కలెక్టర్లకు సూచించారు. లబ్ధిదారులు నష్టపోకుండా వారికి నివాస యోగ్యమైన ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు హౌసింగ్‌శాఖ వద్ద ఉన్న వివరాల మేరకు.. జిల్లాలో 602 ఎకరాల ఇళ్ల స్థలాలు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ స్థలాలను ఎంఎస్ఎంఈల కింద ఔత్సాహికులైన చిన్న పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తే వారికి కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా ఏర్పాటు చేస్తే అక్కడి ప్రజలకు ఉపాధి కూడా దొరికే ఆస్కారం ఉంది. దీనిపై జిల్లా అధికారులు హౌసింగ్ లబ్ధిదారులకు అవగాహన కల్పించాల్సి ఉంది.

రోడ్లు, కమ్యూనిటీ స్థలాలు కలుపుకుంటే.. 602 ఎకరాలు

హౌసింగ్ లేఅవుట్లలో ఎకరాకు (100సెంట్లు) 60శాతం ఇంటి స్థలాలకు పోతే మిగిలిన 40శాతం రోడ్లు, కమ్యూనిటీ అవసరాలకు కేటాయించారు. ఈ లెక్కన జిల్లాలో 362.55 ఎకరాల విస్తీర్ణంలో ఇళ్ల స్థలాలు ఖాళీగా ఉంటే, ఈ కాలనీల్లో రోడ్లు, కమ్యూనిటి స్థలాలకు దాదాపు 240 ఎకరాలు ఎకరాలు విడిచిపెట్టారు. మొత్తం కలిపి చూస్తే జిల్లాలో దాదాపు 602 ఎకరాలు హౌసింగ్ కాలనీల్లో ఖాళీ స్థలం మిగిలి ఉంది.

యువకుల హల్‌చల్...ఇద్దరిపై దాడి





తీవ్రంగా గాయపడిన మల్లికార్జున, దేవరాజులు

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెడ్డివారిపల్లికి వెళ్లే మార్గంలో నూతనంగా నిర్మించే బ్రిడ్జి వద్ద సోమవారం అర్ధరాత్రి ముగ్గురు యువకులు ఇద్దరు కార్మికులపై దాడి చేశారు. రైల్వేకోడూరు ఎస్ఐ లక్ష్మీప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు రెడ్డివారిపల్లి బ్రిడ్జి పనులు చేస్తున్న కార్మికులు దేవరాజులు, మల్లికార్జునపై యువకులు దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని స్థానికులు రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతిలోని రుయాకు తరలించినట్లు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి





ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న దృశ్యం, మృతి చెందిన సుబ్రహ్మణ్యం

రాయచోటి-నేతాజీ సర్కిల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలోని మోటకట్ల శివాలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎన్.సుబ్రహ్మణ్యం (60) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మోటకట్ల గ్రామం రోడ్డువారిపల్లి ఎస్టీ కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం ద్విచక్రవాహనంలో శివాలయం నుంచి ఇంటికి వెళుతుండగా రాయచోటి నుంచి పీలేరు వైపు వెళుతున్న బొలేరో పికప్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆయనను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాదుల్లా తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



వెంకటరమణ మృతదేహం

నిమ్మనపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకొన్న సంఘటన మంగళవారం మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు... తవళం పంచాయతీ చౌకిళ్లవారిపల్లిలో నివాసం ఉంటున్న వెంకటరమణ (56) సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవపడి ఇంటిలో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే వెంకటరమణను మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అక్కడ పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేయగా మార్గమధ్యంలో ప్రాణాలు విడిచినట్లు తెలిపారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

కోడిపందెం స్థావరాలపై దాడులు

● 12 మంది అరెస్ట్ ● 26 మోటార్ సైకిళ్లు, నగదు స్వాధీనం



పోలీసులు అరెస్టు చేసిన కోడిపందెంరాయుళ్లు

రాయచోటి టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దిగువ అబ్బవరం సమీపంలో కోడిపందెం స్థావరంపై మంగళవారం డ్రోన్ సహకారంతో రాయచోటి అర్బన్ సీఐ బీవీ చలపతి ఆధ్వర్యంలో ఎస్ఐలు జహీర్, బాలకృష్ణ దాడులు నిర్వహించి 12 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.25 వేల నగదుతో పాటు, 26 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెడ్డెమ్మ హుండీ ఆదాయం రూ.1.82 లక్షలు

గుర్రంకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లె రెడ్డెమ్మతల్లి హుండీని మంగళవారం దేవదాయ శాఖ అధికారులు లెక్కించారు. అమ్మ వారికి హుండీ ద్వారా రూ.1,82,701 నగదు వచ్చినట్లు దేవదాయ శాఖ అధికారి శశికుమార్ తెలిపారు. ఈ మొత్తాన్ని ఆలయ అభివృద్ధికి వినియోగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ సంప్రోక్షణకు అంకురార్పణ



పుట్టమన్ను సేకరిస్తున్న అర్చకులు



ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండ రామాలయంలో ధ్వజస్తంభ సంప్రోక్షణకు అంకురార్పణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని బలిపీఠము, ధ్వజస్తంభం పీఠాలకు గతంలో అమర్చిన ఇత్తడి కవచాలు దెబ్బతినడంతో కొత్తగా అమర్చారు. ఇందుకుగాను గతనెల 27న కళాకర్షణ పూజలు నిర్వహించారు. మంగళవారం సాయంత్రం ధ్వజస్తంభ సంప్రోక్షణకు అంకురార్పణ కార్యక్రమం అర్చకులు నిర్వహించారు. ముందుగా అర్చకులు వీణ రాఘవాచార్యులు, శ్రావణకుమార్, పవన్‌కుమార్, మనోజ్‌కుమార్ ఉత్సవమూర్తులకు ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మధ్య రంగంలో ఆశీనులు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలోని పుట్ట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టమట్టిని సేకరించి యాగశాలకు తీసుకొచ్చారు. యాగశాలలో పుట్టమట్టికి ప్రత్యేక పూజలు నిర్వహించి హోమం నిర్వహించారు. బుధవారం ఉదయం 7 గంటలకు ధ్వజస్తంభ సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు హనుమంతయ్య, నవీన్‌కుమార్, మధు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

డాగ్, బాంబ్ స్క్వాడ్ మాక్‌డ్రిల్



ప్రభుత్వ ఆసుపత్రిలో తనిఖీలు చేస్తున్న డాగ్ స్క్వాడ్ బృందం

పీలేరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో ఎలా వ్యవహరించాలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు మంగళవారం పోలీసులు పీలేరులో మాక్‌డ్రిల్ నిర్వహించారు. బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ పీలేరు ఏరియా ఆసుపత్రి, రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండు ప్రాంతాల్లో డ్రిల్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక శక్తుల కదలికలపై నిఘా పెట్టడమే కాకుండా అత్యవసర సమయాల్లో వ్యవహరించే తీరుపై స్థానిక పోలీసులు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డ్రిల్ చేపట్టామన్నారు.

ఎన్‌పీసీఐతో ఆధార్ లింక్ చేసుకోవాలి

జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి (నేతాజీసర్కిల్), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దీపం పథకం రెండో విడత (ఏప్రిల్, జూలై)కు సంబంధించి సబ్సిడీ మొత్తం లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాని అంశంపై, జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి సుమతి మంగళవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)తో ఆధార్ నెంబర్ అనుసంధానం కాకపోవడంతోనే ఈ సమస్య ఏర్పడినట్లు గుర్తించామన్నారు. ఇన్‌యాక్టివైన, బ్యాంకు లింకేజీ లేని ఆధార్ నెంబర్ల కారణంగానే సబ్సిడీ జమ కాలేదని తెలిపారు. లబ్ధిదారుల వద్ద రెండు లేదా అంతకన్నా ఎక్కువ బ్యాంకు ఖాతాలు ఉండడంతో ఎన్‌పీసీఐలో ప్రాథమిక ఖాతా నిర్దేశం లేకపోవడం వల్ల సబ్సిడీ జమ కాకపోవడానికి కారణమని జాయింట్ కలెక్టర్ తెలిపారు.

ఈ అంశంపై నిశిత పరిశీలన చేసి తగిన చర్యలు తీసుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్‌ను ఆదేశించారు. జిల్లాలోని ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు తమ ఏజెన్సీ పరిధిలో సబ్సిడీ జమ కాని వారి వివరాలను సేకరించి ఒక ప్రత్యేక డ్రైవ్ ద్వారా తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు, లీడ్ బ్యాంక్ మేనేజర్లు హాజరయ్యారు.

ఉరేసుకుని యువకుడు మృతి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని యువకుడు మృతి చెందిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. తాలూకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మదనపల్లె మండలం వేంపల్లెకు చెందిన హేమావతి, లేట్ శంకర దంపతుల కుమారుడు హిమగిరి (16) పదో తరగతి ఫెయిలై స్థానికంగా ఓ మెకానిక్ షెడ్డులో పనినేర్చుకోవడానికి వెళుతున్నాడు. రెండు రోజులుగా పనికి వెళ్లకపోవడంతో కుటుంబసభ్యులు మందలించారు. దీంతో మనస్థాపం చెంది ఇంట్లో తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే తాలుకా పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు తాలుకా సీఐ, కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నారు.

నరసింహస్వామికి పవిత్రాల సమర్పణ

గుర్రంకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారి పవిత్రోత్సవాలను వేదపండితులు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రతి ఏటా టీటీడీ ఆధ్వర్యంలో పవిత్రోత్సవాలను మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను నిర్వహించారు. టీటీడీ నుంచి వచ్చిన పవిత్ర మాలలకు శాస్త్రోక్తంగా పూజలను నిర్వహించి పవిత్రాలను సమర్పించారు. అనంతరం ఉత్సవమూర్తులకు వేద పండితులు స్నపనతిరుమంజన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం చేస్తున్న అర్చకులు

పంచాయతీల పురోగతిపై శిక్షణ



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి-నేతాజీ సర్కిల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పురోగతి సూచిక 2.0పై మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లాలోని అన్ని శాఖల అధికారులకు డీపీవో రాధమ్మ ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ 2030 నాటికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు పంచాయతీరాజ్ సంస్థల సామర్థ్యాల పెంపు, పనితీరు పర్యవేక్షణకు పురోగతిరాజ్ మంత్రిత్వ శాఖ (ఎంవోపీఆర్) రూపొందించిన పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ ఇచ్చారు. పంచాయతీ పురోగతి సూచిక 2.0 సూచిక స్థానిక ప్రణాళికను జాతీయ స్థాయిలో ఉన్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీఎస్)తో అనుసంధానం చేయడానికి వ్యూహాత్మక సాధనంగా పనిచేస్తుందని, నిర్మాణాత్మక సంస్థాగత యంత్రాంగం ద్వారా వివిధ వనరులను, భాగస్వాములను ఏకీకృతం చేయిస్తూ స్థానిక డేటా పాయింట్ల నుంచి స్థానిక లక్ష్యాలను నిర్ణయించడానికి, థీమాటిక్ గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికను రూపొందించడానికి పురోగతి సూచిక 2.0 బేస్‌లైన్ డేటాను అందిస్తుందని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన

జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మలేరియా అధికారి రామచంద్రారెడ్డి

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని, వీటిపైన ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం దేవళంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. స్వస్థ నారీ.. సశక్త పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్య శిబిరంలో మధుమేహ పరీక్షలు, రక్తపోటు పరీక్షలు, టీబీ శాంపిల్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందితో మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని, ఎప్పటికప్పుడు పల్లెల్లో పర్యటించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. డాక్టర్లు ఎప్పటికప్పుడు 104 ద్వారా గ్రామాల్లో పర్యటించి పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సభ్యులు ఆఫీసర్ జయరామయ్య, డాక్టర్ జియావుల్లా, ఎంపీహెచ్‌ఈవో దేవదానం, హెల్త్ సూపర్‌వైజర్లు మహమ్మద్‌బాషా, మణి, సరళాదేవి, రాజేంద్రప్రసాద్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశానికి గడువు పొడిగింపు

రాజంపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లా జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27లో 9, 11 తరగతుల్లో ప్రవేశానికి అక్టోబరు 7వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.గంగాధరన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 2026 ఫిబ్రవరి 7న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి కడప జిల్లాలో చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వేరుశనగ రైతులకు కూలీల దెబ్బ

- ● టమోటా పంట వైపే కూలీల మొగ్గు
- ● రెట్టింపవుతున్న పంట ఖర్చులు
- ● ఏడాదికేడాదికి తగ్గుతున్న వేరుశనగ సాగు

కురబలకోట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రధానంగా రైతన్నలు సాగు చేసే పంటలలో వేరుశనగకు ప్రత్యేకస్థానం ఉంది. పూర్తిగా వర్షంపైనే ఆధారపడి పంటను సాగు చేస్తారు. ఏడాదికేడాది ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదైనా, కాకపోయినా రైతన్నలు పంట సాగుపై మొగ్గు చూపుతున్నారు. అయితే ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలకు కనీసం గిట్టుబాటు ధరలు లేకపోవడం, పంట ఖర్చులు పెరిగిపోవడంతో వరుస నష్టాలను చవిచూస్తున్నారు. ప్రతి ఏడాది సీజన్‌లో లాభాలను ఆర్జించవచ్చుననే గంపెడాశతో ఎదురుచూస్తున్న రైతన్నలకు నిరాశే ఎదురవుతుంది. దీంతో తీవ్ర నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితులు నెలకొనడంతో గత కొన్నేళ్లుగా పంట సాగు విస్తీర్ణం క్రమేణా తగ్గుతోంది. దీనికి తోడు పంటలో కలుపు తీయడానికి కూలీల కొరత ఏర్పడటంతో సాగు చేసిన పంట దిగుబడిని దక్కించుకోడానికి రైతన్నలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జిల్లాలోని పడమటి ప్రాంత మండలాలలో రైతన్నలు వ్యవసాయంపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. ప్రధానంగా రైతన్నలు టమోటా, వేరుశెనగ, ఉల్లి తదితర పంటలను సాగు చేస్తారు. అయితే ఈ ఏడాది అదునులో వర్షం తక్కువగా నమోదు కావడంతో వేరుశనగ పంట సాగుపై రైతన్నలు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో విస్తీర్ణం బాగా తగ్గింది. సరైన సమయంలో సరిపడా విత్తనాలు లేకపోవడం, నాసిరకంగా విత్తన కాయలు ఉండటంతో రైతులు పెద్దగా మొగ్గు చూపలేదు. కురబలకోటలో 174 హెక్టార్లు, బి.కొత్తకోటలో 99 హెక్టార్లు, తంబళ్లపల్లెలో 227 హెక్టార్లు, ములకలచెరువులో 540 హెక్టార్లు, పీటీఎంలో 336 హెక్టార్లు, పెద్దమండ్యంలో 140 హెక్టార్ల పంటను రైతన్నలు సాగు చేశారు. కాగా వేలాది ఎకరాలు బీళ్ళు భూములుగా మారాయి.



కురబలకోటలో సాగు చేసిన వేరుశనగ

అయితే పంటలో కలుపు మొక్కలు బాగా పెరిగిపోవడంతో రైతన్నలు వాటిపై యుద్ధం చేయాల్సి వస్తోంది. కలుపు తీయడానికి కూలీలు దొరకడం లేదు. ప్రధానంగా టమోటాను భారీ స్థాయిలో సాగు చేయడంతో ఈ పరిస్థితి నెలకొన్నది. కాగా టమోటా పంటలో కూలీ పనులు చేయడానికి వెళితే కూలీలకు సాధరణ కూలీలతో పోల్చితే రెట్టింపు కూలీలు ఇవ్వడంతో పాటు, టిఫన్, భోజనం, కూల్‌డ్రింక్స్ తదితర వసతులను కల్పిస్తారు. దీంతో అటు వైపు కూలీలు మొగ్గు చూపుతున్నారు. దీంతో వేరుశెనగ రైతులు కూలీలు కోసం నిరీక్షించాల్సి వస్తోంది. దీంతో తమ పొలాలలో కలుపు మొక్కలను తొలగించడానికి పనులకు వచ్చే కూలీలకు అదే తరహాలో కూలీలు, వసతులు కల్పించాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో పంట దిగుబడి ఏమాత్రం చేతి అందుతుందో వేచి చూడాల్సి ఉంది.

రిటైర్డ్ ఎస్ఐపై చీటింగ్ కేసు నమోదు

కడపక్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) రిటైర్డ్ ఎస్ఐ, అతని కుమార్తెపై చీటింగ్ కేసుతో పాటు బెదిరింపు కేసు నమోదు చేసినట్లు కడప వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. విజయభాస్కర్‌రెడ్డి కడపకు చెందిన రిటైర్డ్ ఎస్ఐ పెంచలయ్య స్నేహితులుగా ఉండేవారు. ఈ నేపథ్యంలో పెంచలయ్య తన కుమార్తె పేరు మీద ఆయిల్ ట్యాంకరు తీసుకుంటే సబ్సిడీ వస్తుందని, పెట్టుబడిగా డబ్బులు పెడితే మేనేజరుగా పెట్టి, పార్టనరుగా పెట్టుకుంటానని నమ్మించినట్లు తెలిపారు. దీంతో వారి మాటలు నమ్మి విజయభాస్కర్‌రెడ్డి 2012లో రూ.90లక్షలు, మరో మారు రూ.12లక్షలు ఇచ్చాడని.. ఇందుకు రెండు చెక్కులు పెద్దమనుషుల సమక్షంలో అగ్రిమెంట్లు రాసిచ్చినట్లు తెలిపారు. అప్పటి నుంచి విజయభాస్కర్‌రెడ్డి డబ్బులు ఇవ్వకుండా ఆయిల్ ట్యాంకరుకు పార్టనర్‌షిప్ ఇవ్వకుండా మోసం చేయడంతో పాటు డబ్బు తిరిగి ఇవ్వాలని అడగడంతో పెంచలయ్య, అతని కూతురు ఎస్సీ, ఎస్టీ కేసులు పెడతామంటూ బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తండ్రి, కుమార్తెపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేంపల్లె గంగాధర్‌కు ఆహ్వానం



కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని భారతీయ సాంస్కృతిక మంత్రి త్వ శాఖ, కేంద్ర సాహిత్య అకాడమీ, బీహార్ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సాహితీ సదస్సుకు తెలుగు భాషా విభాగం నుంచి జిల్లాకు చెందిన ప్రసిద్ధ సాహితీవేత్త, భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ వేంపల్లె గంగాధర్‌కు ఆహ్వానం అందింది. సెప్టెంబరు 25 నుంచి 28వ తేదీ వరకు బీహార్ రాజధానిపాట్నా నరంలో దేశ విదేశాలకు చెందిన పలువురు సాహిత్య సాంస్కృతిక కళాకారుల సదస్సు జరగనుంది. డాక్టర్ వేంపల్లె గంగాధర్ తనకథా సంపుటి మొలకల పున్నమి రచనకు 2011 కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం అందుకున్నారు. మూడు వారాలపాటు రాష్ట్రపతి భవన్‌లో విడిది చేసిన తొలి సాహిత్యకారుడిగా గుర్తింపు పొందారు.

సెర్ప్ కార్యక్రమాలపై అవగాహన

కడప ఎన్టీఆర్‌సర్కిల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన సంస్థ నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలను అర్హులకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని సెర్ప్ సిబ్బందికి డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ జి.రాజ్యలక్ష్మి దిశా నిర్దేశనం చేశారు. నగర శివారులోని టీటీడీసీ భవనంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బద్వేలు, పీడీ సెర్ప్ అమలు చేస్తున్న అన్నిరకాల కార్యక్రమాలపై రివ్యూ చేశారు. ఐబీ, బ్యాంకు లింకేజీ, శ్రీనిధి, జీవనోపాదులు, హెల్త్ అండ్ న్యూట్రిషన్ ఉన్నతి వంటి అన్నిరకాల పథకాలపై క్షేత్రస్థాయి సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమలాపురం, మైదుకూరు, కడప క్లస్టర్స్ వెలుగు సిబ్బంది, సీసీలు, డీపీఎం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ కళాశాలకే గర్వకారణం

● డీన్ డాక్టర్ మాధవ

పులివెందులరూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐకార్) నిర్వహించిన పీజీ (ఏఐఈఈఏ) పరీక్షలో తమ విద్యార్థులు చూపిన ప్రతిభ కళాశాలకే గర్వకారణమని ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్.మాధవ తెలిపారు. ఈ ఏడాది ఐకార్ ప్రకటించిన ఫలితాల్లో ప్రియాంక అనే విద్యార్థినికి దేశ వ్యాప్తంగా మూడవ ర్యాంకు వచ్చిందన్నారు. అలాగే ఓబీసీ కేటగిరీలో సాయిదీప్తి 22వ ర్యాంకు, షర్మిల 42వ ర్యాంకు, ఎస్సీ కేటగిరీలో షకీనా 43వ ర్యాంకు, హర్షవర్ధన్ 81వ ర్యాంకు, ఎస్టీ కేటగిరీలో నితిన్ 24వ ర్యాంకు సాధించిరన్నారు. ఈ సందర్భంగా ప్రతిభచాటిన విద్యార్థులను, అధ్యాపకులను డీన్ మాధవ, ఇతర అధ్యాపకులు అభినందించారు.

వైవీయూలో నీటి కోసం కటకట

కడపఎడ్యుకేషన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయం అంటే జ్ఞానాలయం. అక్కడ శాస్త్రీయ వాతావరణం, విద్యా విలువలతో పాటు కనీస సదుపాయాలు కూడా లభించాలి. కానీ వైవీయూ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌లో తాగునీరు లేకపోవడం విద్యార్థులు, అధ్యాపకులను దయనీయ పరిస్థితికి నెట్టేస్తోంది. ఇది ఒక సాధారణ సమస్యలా కనిపించినా దీని వెనుక ఉన్న నిర్లక్ష్యం మాత్రం పరిపాలన దౌర్బల్యాన్ని బట్టబయలు చేస్తోంది.

ప్రతిరోజు వందలాది మంది విద్యార్థులు, సిబ్బంది, అధ్యాపకులు ఈ బిల్డింగ్‌లో తిరుగుతుంటారు. అక్కడ ఫైల్ పనులు, బోధనతో పాటు పలు సమావేశాలు జరుగుతుంటాయి. కానీ తాగునీరు లాంటి ప్రాథమిక సౌకర్యమే దొరకని పరిస్థితి. ఒక విశ్వవిద్యాలయం అధునాతన పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకొనే ముందు, తమ



వైవీయూ న్యూ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్

విద్యార్థులకు, అధ్యాపకులకు కనీస సౌకర్యాలుకల్పించగలగాలి. లేదంటే విశ్వవిద్యాలయం ప్రతిష్టే ప్రశ్నార్థకం అవుతుంది. విద్యార్థులు, అధ్యాపకులు ఎదుర్కొంటున్న ఈ సమస్య పరిపాలనలోని గజిబిజి, నిర్లక్ష్యాన్ని బయటపెడుతోంది. ఈ బిల్డింగ్‌లో మొత్తం మూడు డిపార్ట్‌మెంట్‌లు ఉన్నాయి. అలాగే అకౌంట్స్ సెక్షన్, మరికొన్ని పరిపాలనపరమైన సెక్షన్స్ ఉన్నాయి. ఇక్కడ విద్యార్థుల విద్యభ్యాసంతో పాటు సిబ్బంది కూడా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి తాగునీరులేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే బల్డింగ్‌లో మాజీ వైస్ చాన్సలర్ కూడా విధులు నిర్వహించడం గమనార్హం. ఆయన కూడా ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నారంటే వైవీయూలో విద్యార్థులకు ఎటువంటటి సౌకర్యాలు లభిస్తున్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. చిన్నచిన్న సౌకర్యాల లోపాలను పరిష్కరించకపోతే, విద్యార్థులలో అసహనం పెరుగుతుంది. నీటి సౌకర్యం కల్పించలేని యూనివర్సిటీ బిల్డింగ్ జ్ఞానానికి ఇది ఎలాంటి ప్రతిబింబం అనే ప్రశ్న ప్రతి ఒక్కరి మనసులో మిగిలిపోతుంది. నీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

వ్యవసాయంలో స్థిరమైన ఉత్పాదకత సాధించాలి : కలెక్టర్

● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడపకలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆధునిక పద్ధతులు పాటించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చవచ్చని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం బోర్డు మీటింగ్ హాలులో ఆధునిక వ్యవసాయ పద్ధతులపై జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలసి కలెక్టర్ వ్యవసాయ అధికారులు, ఇఫ్కో(ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్స్ కో-ఆపరేటీవ్ లిమిటెడ్) ప్రతినిధులు, సుస్థిర వ్యవసాయ కేంద్రం ప్రతినిధులు, నాబార్డు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నూతన వ్యవసాయ పద్ధతులను అవలంభించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని తక్కువ ఖర్చుతో అధిక ఉత్పాదికత సాధించి రైతులు లాభాలు గడించేలా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద వేముల, ఒంటిమిట్ట, వేంపల్లి మండలాల్లో ఇప్పటికే అరటి పంటల్లో ఈ పద్ధతిని అవలంబిస్తున్నారన్నారు.కార్యక్రమంలో వ్యవసాయశాఖ జేడీ చంద్రానాయక్, ఏపీఎంఐపీ వెంకటేశ్వర్లు, నాబార్డు ఏజీఎం విజయ్ విహారీ, లీడ్ బ్యాంకు మేనేజర్ జనార్ధన్, మైక్రో ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సేవలు అందించాలి

● ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురవయ్య

కడప నాగరాజుపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలందించాలని ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్) గురవయ్య అధికారులకు సూచించారు. మంగళవారం కడపలోని ఈఈ కార్యాలయంలో కడప, వల్లూరు, పెండ్లిమర్రి, చింతకొమ్మదిన్నె, సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో నష్టాలు అధికంగా ఉన్నాయని, వీటిని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సంతృప్తిస్థాయి కేవలం 59.53 శాతం మాత్రమే ఉందని, ఇది ఆందోళనకరమన్నారు. పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. లోటల్టేజ్ సమస్య నివారణకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, విద్యుత్ చౌర్యం అరికట్టేందుకు దాడులు నిర్వహించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఈ రమణ, ఈఈలు హరిసేవ్యానాయక్, రమణారెడ్డి, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ప్రసన్నాంజనేయులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

జిల్లాలోని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కడపలోని విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ రమణను కలిసి వారు మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లందరికీ పెయిడ్ హాలిడేస్, ఐటీఐ విద్యార్హతలు ఉన్న వారికి పాత ఆపరేటర్‌తో సమానంగా జీతాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు, మైదుకూరు, పులివెందుల, డివిజన్ల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన టీడీపీ, వైసీపీ నేతలు

కడప క్రైం/ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన షెల్కే నచికేత్ విశ్వనాథ్‌ను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డిలు మంగళవారం వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేను అందించారు. అనంతరం జిల్లా శాంతిభద్రతల విషయమై మాట్లాడినట్లు తెలుస్తుంది. ఈ సందర్భంగా ఎస్పీని శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అలాగే వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, నగర మేయరు సురేశ్‌బాబుతో పాటు పలువురు వైసీపీ నేతలు ఎస్పీని శాలువా కప్పి పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మరుగుదొడ్డి స్థలంపై విచారణ



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న పాకా సురేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగర 47వ డివిజన్ నబీకోట గంగమ్మగుడి వద్ద 1974లో నిర్మించిన బహిరంగ మరుగుదొడ్డి స్థలంపై విచారణ చేపడుతున్నారు. ఇక్కడి నిర్మాణాన్ని 2001లో మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. కానీ తాజాగా కొందరు దుండగులు ఆ స్థలం తమదంటూ నకిలీ పేపర్లు చూపించి చెట్లు నరికేయడంతో స్థానికులు ఆగ్రహం వెల్లగక్కారు. పత్రికల్లో వార్తలు వెలువడగానే రెవెన్యూ, మున్సిపల్ అధికారులు తాపీగా అక్కడకు చేరుకున్నారు. ఈ వ్యవహారాన్ని స్థానిక కార్పొరేటర్ పాకా సురేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు తెలుపగా వారు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ప్రజల ఆస్తులను కాపాడడంలో విఫలమవుతున్న అధికారులు తమ వైఫల్యాన్ని అంగీకరించాలని, లేకుంటే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందన్నారు.

అక్రమాలపై విచారణ చేపట్టాలి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్‌సీఎం ఎయిడెడ్ ఉపాధ్యాయ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ విద్యార్థి యువజన ప్రజాసంఘాల జేఏసీ నాయకులు కడప ఆర్జేడీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. బోగస్ సర్టిఫికెట్లతో నియామకాలు చేపట్టి, కోట్లు వసూళ్లు చేశారని ఆరోపించారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌పీ అధ్యక్షుడికి నీఫా అవార్డు

కడప సెవెన్‌రోడ్స్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పీ సేవా సంస్థ వ్యవస్థాపకుడిగా దాసరి ప్రదీప్‌కుమార్ నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరం ఆఫ్ ఆర్టిస్ట్స్ అండ్ ఆక్టివిస్ట్ (నీఫా) ఆధ్వర్యంలో అవార్డు అందుకున్నారు. మంగళవారం ఢిల్లీలోని భారత్ మండపంలో నీఫా వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రీత్‌పాల్‌సింగ్ పన్ను, రష్యా ఆర్ట్స్ అండ్ కల్చరల్ ప్రతినిధి మంగళ్‌దూబే, జపాన్ ఎడ్యుకేషనల్ ప్రతినిధి మయాసు చేతులమీదుగా ఈ అవార్డును అందుకున్నారు. వృద్ధులకు, రక్తదాన శిబిరాలు, ఆత్మహత్యల నివారణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతోనే ఈ అవార్డు దక్కిందని ప్రదీప్ తెలిపారు.

పనిగంటల పెంపు వెనక్కు తీసుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కార్మికుల పని గంటలను 8 నుంచి 13కి పెంచుతూ శాసనసభ, శాసనమండలిలో చేసిన తీర్మానాలను ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎం) కడప నగర కార్యదర్శి రామ్మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత 13 ఏళ్లుగా కనీస వేతనాలను ప్రభుత్వం సవరించలేదని, వెంటనే ధరలకు అనుగుణంగా వేతనాలను సవరించాలన్నారు. యాజమాన్యాలు కార్మికులను మరింత దోపిడీ చేయడానికి ప్రభుత్వం ఆమోదం తెలపడం సరైంది కాదన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో యూపీహెచ్‌సీలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు కడప ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. అలాగే ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, ఎఫ్ఎన్ఓ అభ్యర్థుల ఫైనల్ మెరిట్ జాబితాను కడప వెబ్‌సైట్‌లో ఉంచామని పేర్కొన్నారు.

బేకరీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

పులివెందుల రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని ఓ బేకరీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హరిత మంగళశారం ఉదయం తనిఖీలు చేపట్టారు. బేకరీలో అన్ని రకాల పదార్థాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన, పాడైపోయి అలాగే ఉంచిన పదార్థాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పులివెందులలో బెస్ట్ బేకరీలో చెడిపోయిన కేక్‌ను విక్రయించారని ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో తనిఖీలు చేపట్టామన్నారు. బేకరీ లైసెన్స్, లేబర్ లైసెన్స్‌తో పాటు బేకరీలో అన్ని పదార్థాలను పరిశీలించి అనుమానం కలిగిన వాటిని ల్యాబ్‌కు పంపామన్నారు. ల్యాబ్ నుంచి వచ్చిన రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రాముడు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.



టీడీపీ నగర అధ్యక్షుడిగా ఎంపికైన మన్సూర్ అలీఖాన్‌కు స్వీట్ తినిపిస్తున్న శ్రీనివాసరెడ్డి









శేషవాహనంపై కడప దేవదేవుడు, చెన్నూరు చౌడేశ్వరి ఆలయంలో బాలత్రిపురసుందరీదేవి అలంకారం, వల్లూరులో రాజరాజేశ్వరిదేవి అలంకారంలో అమ్మవారు, కమలాపురంలో మధుర మీనాక్షిదేవి అలంకారంలో దర్శనమిస్తున్న కన్యకాపరమేశ్వరిదేవి

లోకపావనీ.. రక్షమాం..

● భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు ● విద్యుత్ దీపకాంతులతో ధగధగ

కడపకల్చరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు మంగళవారం జిల్లా వ్యాప్తంగా అమ్మవారి ఆలయాలు దేదీప్యమానంగా, విద్యుద్దీపాల కాంతులతో ప్రకాశించాయి. అమ్మవారి ఆలయాలు నూతన శోభను సంతరించుకున్నాయి. లోకపావనీ.. జగజ్జనని, రక్షమాం.. అంటూ భక్తులు ఆ తల్లిని శరణు కోరారు.

అమ్మవారిశాలలో

నగర అమ్మవారిశాలవీధిలో వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయం భక్తులతో కిక్కిరిసింది.

విజయదుర్గాదేవి ఆలయంలో

విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు బ్రహ్మచారిణిదేవిగా రెండోరోజు భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారికి విశేష పూజలు, చండీహోమాలు నిర్వమించారు. వేకువజామున 18 విశేష కలశాల్లో అభిషేక కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం కావడంతో మధ్యాహ్నం 3 నుంచి 4.30 వరకు రాహుకాల పూజలు చేశారు. పిదప అమ్మవారు బ్రహ్మచారిణిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి సింహ వాహనంపై స్వామిఅమ్మవార్లు ఊరేగారు.

దేవునికడపలో

తిరుమల తొలిగడప దేవునికడప ఆలయంలో మంగళవారం దేవదేవుడు శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టరు ఈశ్వర్‌రెడ్డితో పాటు ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

లలితాదేవి ఆలయంలో

నగర శివారు ప్రాంత లలితాపంచాయతన దేవాలయంలో శాస్త్రోక్తంగా నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆధ్యాత్మిక సంస్థ చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో లలితా పంచాయతన ఆలయంలో జగన్మాత రెండోరోజు అమ్మవారు బాలత్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

రాజరాజేశ్వరి ఆలయంలో

రాజరాజేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారికి మంగళగౌరీదేవి అలంకారం గావించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పిడతల గోపాలక్రిష్ణ సారధ్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

బాలాజీ ఆలయంలో

గడ్డిబజారులో వెలసిన లక్ష్మి సత్యానారాయణస్వామి దేవస్థానం (బాలాజీ)లో రెండోరోజు అమ్మవారు శ్రీక్రిష్ణ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రజలు ఆలయం చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

రాజారెడ్డివీధిలో

రాజారెడ్డివీధిలో వెలసిన గ్రామ దేవత గంగమ్మ ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు హాజరై అమ్మవారి సేవలో తరించారు.

సోమసుందరేశ్వరస్వామి ఆలయంలో

గడ్డిబజారులో వెలసిన కామకోటి కళాంబదేవి సమేత సోమసుందరేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు చంద్రమౌళిశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రెండోరోజు అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

చౌడేశ్వరిదేవి ఆలయంలో

ఎర్రముక్కపల్లెలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు బాలత్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు. అలాగే నగరంలోని పలు ఆలయాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.



విజయదుర్గా ఆలయంలో కలశాన్ని తీసుకెళుతున్న ఆలయ నిర్వాహకులు



రాహుకాల పూజల్లో మహిళా భక్తులు



కడప : నబీకోట శివాలయంలో బాలా త్రిపురసుందరీదేవి అలంకారం









పులివెందుల: గజలక్ష్మీదేవి అలంకరణలో అంకాలమ్మ అమ్మవారు, కడప : రాజరాజేశ్వరిదేవి గుడిలో మంగళగౌరీదేవి అలంకారం, భద్రావతి భావనారుషి ఆలయంలో వైష్ణవీదేవి అలంకారం, నడివీధిగంగమ్మతల్లి ఆలయంలో రాజరాజేశ్వరిదేవి అలంకారం

ఎమ్మెల్యేపై నోరు జారితే సహించేది లేదు : కార్పొరేటర్లు



పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ కార్పొరేటర్లు

కడప మారుతీనగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కంచుకోటగా ఉన్న కడప గడ్డపై టీడీపీ జెండాను రెపరెపలాడించిన కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డిపై ఎవరైనా నోరు జారితే సహించేది లేదని ఆ పార్టీ కార్పొరేటర్లు హెచ్చరించారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో కార్పొరేటరు సూర్యనారాయణ, రాజశేఖర్‌రెడ్డి, చల్లా రాజశేఖర్, సుదర్శన్‌రెడ్డి, సుబ్బారెడ్డిలు మాట్లాడారు. ఇటీవల సింగిల్ విండో చైర్మన్‌గిరిని మాధవీరెడ్డి, శ్రీనివాసరెడ్డి అండదండలతో పొందిన క్రిష్ణారెడ్డి తిన్నింటి వాసాలు లెక్కపెట్టేలా పార్టీని కడపలో భ్రష్టుపట్టించేలా వ్యవహరిస్తున్నారన్నారు. గత కొన్నేళ్లుగా టీడీపీ అండదండలతో క్రిష్ణారెడ్డి కడపలో సాగించిన దందాలు కోకొల్లలు అన్నారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖను అడ్డుపెట్టుకుని సొంత బావ ఆస్తినే కాజేశారని ఆరోపించారు. అలాగే నగర పరిధిలోని ప్రకాశ్‌నగర్, నానాపల్లెలో స్థలాలు ఆక్రమించడమే కాకుండా కడపలో ఉన్న ప్రతి రేషన్‌షాపు డీలర్ల వద్ద లంచాలకు అలవాటుపడ్డారని ఆరోపించారు. ఇప్పటికైనా పంథా మార్చుకోకపోతే ఆయన కడపను వీడిపోయే పరిస్థితులు దాపురిస్తాయని హెచ్చరించారు.

ట్రాఫిక్ సమస్య సృష్టిస్తే చర్యలు

కడపక్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ సమస్య క్రమబద్ధీకరించే క్రమంలో ద్విచక్ర వాహనదారులతో పాటు తోపుడుబండ్లవారు తమ వాహనాలు ఎక్కడబడితే అక్కడ ఆపి ట్రాఫిక్‌కు అంతరాయం కల్పిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్ఐ జయరాములు స్పష్టం చేశారు. మంగళవారం దుకాణదారులతో జరిపిన సమావేశంలో మాట్లాడారు. నగరంలోని పలు కూడళ్లలో రోడ్డు ఆక్రమించుకుని వ్యాపారాలు చేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భవననిర్మాణ కార్మికులపై చిత్తశుద్ధి ఏదీ ?

కడప సెవెన్‌రోడ్స్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధి చూపడం లేదని ఏఐటీయూసీ, అనుబంధ సంఘాల నాయకులు విమర్శించారు. మంగళవారం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏఐటీయూసీరాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్.నాగసుబ్బారెడ్డి, జిల్లా డిప్యూటీ సెక్రటరీ కేసీ బాదుల్లా, ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ మద్దిలేటి, కడప జిల్లా అధ్యక్షకార్యదర్శులు బి.ఆరామంజనేయులు, లింగన్న మాట్లాడారు.

ఔషధాల దుష్ప్రభావాలపై జాగ్రత్త అవసరం

కడప సెవెన్‌రోడ్స్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో ఔషధాల దుష్ప్రభావాలపై జాగ్రత్త ఎంతో అవసరమని కడప ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జమున తెలిపారు. కడప ప్రభుత్వ వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగం వారు ఈ నెల 17 నుంచి 23వ తేది వరకు విజిలెన్స్ కార్యక్రమాన్ని వారం రోజుల పాటు నిర్వహించారు. నగరంలోని రామిరెడ్డి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, నర్సింగ్ కళాశాల ఇతర విద్యాసంస్థల్లో ఔషధాల దుష్ప్రభావాలకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కరపత్రాలను పంపిణీ చేశారు.

దసరాకు డీఏలు ప్రకటించాలి

● ఎన్జీవో నగర అధ్యక్షుడు చిన్నయ్య

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న నాలుగు విడతల కరువు భత్యాన్ని విడుదల చేయాలని ఏపీ ఎన్జీవో ఉద్యోగ సంఘ నగర అధ్యక్షుడు కంభం చిన్నయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా డాక్టర్ నాజీముద్దీన్ పుట్టినరోజు వేడుకలు



పూలమొక్కను అందజేస్తున్న దృశ్యం

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు డాక్టర్ నాజీముద్దీన్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం కడప నగరం క్రిస్టియన్ లైన్‌లోని ఆయన క్లినిక్‌లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి హాజరై కేక్ కట్ చేశారు. మైనార్టీ నాయకులకు తెలుగుదేశం పార్టీ ప్రాధాన్యం ఇస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మన్సూర్‌అలీఖాన్, జియా, మాజీ కార్పొరేటర్ జాగిరుద్దీన్, డాక్టర్ అమీర్ బాష, తారిఖ్ అలి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దుకుందాం

చెన్నూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మేజరు గ్రామ పంచాయతీ చెన్నూరును మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దుకుంటామని డిప్యూటీ ఎంపీడీవో సురేశ్‌బాబు అన్నారు. స్థానిక చెన్నూరులో పంచాయతీ సిబ్బంది, ఉపాధి డ్వాక్రా పారిశుధ్య కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టరు ఆదేశాల మేరకు చెన్నూరును పూర్తిస్థాయిలో ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, ఏపీఎం శైలజ పాల్గొన్నారు.

ఈ-పంటను నమోదు చేసుకోవాలి

కడపరూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో పంటను వేసిన ప్రతి రైతు ఈ-పంటను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.సురేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కడప మండలంలోని నానాపల్లి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆత్మా అధికారి రాధికాబాయి, ఎంపీఈవో కవిత, రైతులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగులకు సత్కారం

కడపమారుతీనగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ ఉద్యోగులకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన జిల్లా స్థాయిలో ఉత్తమ సేవలు కనబరిచిన తపాల ఉద్యోగులకు పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ మోటివేషన్ సెషన్ డివిజన్ స్థాయి అవార్డ్స్‌ను మంగళవారం స్థానిక ఐఎంఏ హాలులో అందించి సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ సర్కిల్ డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ సంతోష్ మెహతా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు తపాలా కడప డివిజను శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

నూతన జీఎస్టీ విధానంతో లబ్ధి

పులివెందులరూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జీఎస్టీ విధానంతో పేద ప్రజలకు లబ్ధి చేకూరుతోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగల శశిభూషణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పులివెందులలో ఆయన మాట్లాడుతూ ఇక నుంచి జీఎస్టీ కేవలం రెండు శ్లాబ్‌లలో 5శాతం లేదా 18శాతం మాత్రమే ఉంటుందన్నారు. దీనివల్ల వినియోగదారులకు ఆర్థికంగా లాభం చేకూరుతుందని తెలిపారు.

కుటుంబ కలహాలతో దాడి

పులివెందుల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిపై కుటుంబ కలహాలతో దాడి జరిగినట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. పట్టణంలోని యర్రగుడిపల్లెకు చెందిన ఆనంద్ అనే వ్యక్తి జేఎన్టీయూ సమీపంలో అనుమానాస్పదంగా గాయాలతో పడి ఉన్నారన్నారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా ఆనంద్‌కు బంధువైన లోమడ సురేంద్ర అనే వ్యక్తి కత్తితో దాడి చేసినట్లు తేలిందన్నారు. నిందితుడు సురేంద్రను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి కేసు నమోదు

పులివెందుల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని నగరిగుట్టకు చెందిన మహేష్ అనే వ్యక్తిపై దాడి జరిగినట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. వివరాలిలా.. నగరిగుట్టకు చెందిన మహేష్‌ను శివతో పాటు వెంకటరమణ, అఖిల్, బబ్లు, మరో వ్యక్తి దాడి చేశారన్నారు. బాధితుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తూకం మిషన్లను సరిచేయించుకోవాలి


చెన్నూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌక దుకాణం డీలర్లంతా ప్రతి ఏటా తూకం మిషన్లను సరిచూసుకోవాలని కడప తూనికలు కొలతల ఇన్‌స్పెక్టరు రమేశ్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం చౌక దుకాణాల మిషన్లను ఆ శాఖ ఆధ్వర్యంలో సరిచేయించారు. వీఆర్వోలు, డీలర్లు పాల్గొన్నారు.

రాజోలి జలాశయాన్ని నిర్మించాలి

జమ్మలమడుగు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజోలి జలాశయాన్ని ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిర్మించాలని భారతీయ కిసాన్‌సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు సహదేవరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దముడియం మండలంలోని పెద్దపసుపుల గ్రామం మాధవరాయస్వామి దేవాలయంలో గ్రామ, మండలస్థాయి శిక్షణ తరగతులు నిర్వహించి మాట్లాడారు. గతంలో రాజోలి జలాశయం నిర్మించి ఎకరాకు రూ.12లక్షలు పరిహారం ఇస్తామని చెప్పినప్పటికీ అప్పట్లో రైతులు ఒప్పుకోలేదన్నారు. ఎకరాకు రూ.20 లక్షలు పెంచి ఇవ్వాలని, రాజోలి జలాశయం నిర్మాణం ఆలస్యమైతే ఎకరా మెట్ట భూమికి రూ.25వేలు, మాగాణి భూమికి రూ.40 వేలు కౌలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, కార్యదర్శి సుబ్బారెడ్డి, బాధిత రైతులు పాల్గొన్నారు.

ఆలయ ఆవరణలోని ఇంటిలో చోరీ

దువ్వూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు సమీప గంగమ్మ దేవాలయంలో ఆవరణలో ఉన్న ఇంటిలో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోని బీరువాను పగులకొట్టి అందులో ఉన్న ముక్కుపుడక, వెండి ఊయల అపహరించారు. ఈమేరకు మంగళవారం ఆలయ నిర్వాహకులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్‌ఐ భూషణం, సిబ్బంది ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు.









కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో ఎన్నో ఏళ్లుగా చాలీ చాలని జీతాలతో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్నారు. ఆర్టీపీ పీలో 17 నుంచి వివిధ రూపాల్లో ఆందోళన కొనసాగుతోంది. మంగళవారం రిలే దీక్షల్లో బాగంగా రెండవ రోజు పి.సూరిబాబు, వై.హరిచంద్రరెడ్డి, ఎం.రామాంజనే యులురెడ్డి, షేక్ షబ్బీర్, కే.వెంకటశివుడు కూర్చున్నారు. కాంట్రాక్టు కార్మి కుల 2022 పీఆర్సీ అరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. బీఎంఎస్, ఓసీ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ అసోషియేషన్ వారు మద్దతుగా పాల్గొన్నారు.

డాబాల్లో మద్యం తాగిస్తే చర్యలు తప్పవు

ఖాజీపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డాబాల్లో, లాడ్జీల్లో, హోటళ్లలో మద్యం తాగినట్లు తెలిస్తే యజమానిపై శాఖాపరమైన చర్యలు తప్పవని సీఐ వంశీధర్ అన్నారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఫుల్‌గా...' వార్త ప్రచురితం కావడంతో డాబా, లాడ్జీ, హోటల్ యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ హైవేలో గల డాబాల్లో, లాడ్జీల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకూడదని, మరోసారి మద్యం తాగించి నట్లు తెలిసినా, రాత్రి వేళల్లో నిర్ణీత సమయానికే మూయకపోయినా చర్యలు తప్పవన్నారు. .

ప్రమాదవశాత్తు డ్రైనేజీలో పడి ఉపాధ్యాయుడు మృతి

జమ్మలమడుగు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మునిసిపాలిటీ పరిధిలోని కన్నెలూరు మోటు పక్కన ఉన్న డ్రైనేజీ కాలువలో పడి పోసా మధుబాబు (52) అనే ఉపాధ్యాయుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... కన్నెలూరుకు చెందిన మధుబాబు పెద్దముడియం మండలం జె.కొట్టాలపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తు న్నారు. సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చి తిరిగి వెళుతుండగా కన్నెలూరు మోటు వద్ద ప్రమాదవశాత్తు కాలుజారి మురుగునీటి కాలువలో పడి మృతి చెందాడు. ఈయనకు భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భార్య ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జమ్మలమడుగు అర్బన్ సీఐ నరేష్‌బాబు తెలిపారు.

వాహనం ఢీకొని బాలిక మృతి

కొండాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దత్తాపురం బస్ స్టాప్ వద్ద మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో స్వాతి (13) అనే బాలిక మృతి చెందింది. బుక్కపట్నం గ్రామానికి చెందిన స్వాతి బస్‌స్టాప్ వద్ద నుంచి ఆవలి వైపునకు దాటుకుంటుండగా, వేగంగా గుర్తు తెలియని వాహనం వచ్చి ఢీకొట్టడంతో స్వాతి అక్కడిక్కడే మృతి చెందినట్లు తాళ్లప్రొద్దుటూరు ఏఎస్సై బాసు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా బక్కపట్నం గ్రామానికి చెందిన అనిల్ కుమార్తె స్వాతి దత్తాపురం జడ్పీహైస్కూల్‌లో తొమ్మిదవ తరగతి చదువుతోంది. కుమార్తెను కోల్పోవడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.

సోలార్ కంపెనీలో దొంగతనం

కొండాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):మండలంలోని టి.కోడూరు వద్ద నున్న సోలార్ కంపెనీలో దొంగతనం జరిగినట్లు తాళ్లప్రొద్దుటూరు ఏఎస్సై బాసు తెలిపారు. సోమవారం రాత్రి కంపెనీకి చెందిన పరికరాలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు కంపెనీ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

టిప్పరు, లారీ ఢీ- డ్రైవర్‌కు గాయాలు

కొండాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓబన్నపేట బస్టాండు సమీపంలో మంగళవారం ఉదయం టిప్పరు, లారీ ఢీకొన్న సంఘటనలో టిప్పర్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు తాడిపత్రి వైపు వెళుతున్న లారీ , అదే వైపు వెళుతున్న టిప్పరు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో టిప్పరు ముందు భాగం పూర్తిగా దెబ్బతిని, టిప్పర్ డ్రైవర్ కొద్దిసేపు ఇరుకున్నాడు. స్థానికులు పొక్లెయిన్ సహాయంతో పక్కకు తప్పించగా అతనికి కాలు విరగడంతో పాటు , గాయాలయ్యాయి. దీంతో ఇతనిని కొండాపురం కు చెందిన 108 వాహనంలో తాడిపత్రికి తరలించారు.

స్థల విషయమై ఘర్షణ వ్యక్తికి గాయాలు

ముద్దనూరు సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి):మండల పరిధి కొసినేపల్లిలో మంగళవారం ప్రతాపరెడ్డి అనే వ్యక్తి ని అదే గ్రామానికి చెందిన వ్యక్తులు కట్టెలతో దాడి చేసి గాయపరిచినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. గ్రామంలో ప్రతాపరెడ్డి, భాస్కర్‌రెడ్డి ల మధ్య స్థల విషయమై వివాదం ఉంది.ఈ తరుణంలో ప్రతాపరెడ్డి పై భాస్కర్‌రెడ్డి కుమారుడు రవీంద్రనాథరెడ్డి, భార్య నర్మదా, మరో వ్యక్తి రామిరెడ్డి దాడి చేసి కట్టెలతో కొట్టారు.దీంతో ప్రతాపరెడ్డికి తలకు గాయాలయ్యాయి.చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు తరలించారు. బాధితుడి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన దొంగ

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు దసరా ఉత్సవాలను తిలకించడానికి ఆలయానికి బయలు దేరిన మహిళ మెడలో మూడు తులాల బంగారుగొలుసు గుర్తు తెలియని వ్యక్తులు బైకు మీద వచ్చి లాక్కెల్కారు. మంగళవారం రాత్రి స్థానిక గోకుల్‌నగర్‌కు చెందిన విజయలక్ష్మీ అనే మహిళ దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి శాలకు ఇంటి నుంచి బయలు దేరి వస్తుండగా కొర్రపాడురోడ్డు లోని మహర్షి స్కూలు వద్దకురాగానే ఎదురుగా బైక్‌పై ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ముఖానికి మాస్కులుదరించి విజయలక్ష్మీ మెడలోని మూడుతులాల బంగారు గొలుసు లాక్కెళ్ళారు. దీంతో ఆమె కేకలు వేసినా వారు బైకుపైపరారయ్యారు. బంగారు గొలుసు దొంగతనం పై టూటౌన్ పోలీసు స్టేషన్లో ఆమె ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

OFFICE OF THE ADDL. DME / SUPERINTENDENT,
GOVT. GENERAL HOSPITAL,
YSR DISTRICT, KADAPA.

R.C. No. 2434/G2/2025 Dated : 23.09.2025

TENDER NOTIFICATION

Sealed Tenders are invited from the reputed agencies for Annual Maintenance & Service Contract (AMC) for AC's for a period of one (1) year in various departments of O.P. Block & I.P. Block at Government General Hospital, Kadapa.

DETAILS OF ACs FOR AMC

Sl. No.	Type of ACs	Capacity of ACs in Tons	Quantity
1.	Split ACs	2	137
2.	Ductable ACs 7.5 TR	7.5	15
3.	Modular OT Ductable	24	8
4.	Ductable 11 TR	11	4
	TOTAL		164

The Tender application forms and list of items along with terms and conditions can be obtained from the office of the Superintendent, Govt. General Hospital, Kadapa from 23.09.2025 to 01.10.2025 on payment of Rs. 1,000/- by way of Demand Draft in favor of Convenor, HDS, Govt. General Hospital, Kadapa in person on working days from 10.30 AM to 5 PM. Further details, have been uploaded in the District Official Website www.kadapa.ap.gov.in (Notices>Tenders.)

Dates for Sale of Tender application Forms : **23.09.2025 to 01.10.2025**
Last date for receipt of Tender application : **01.10.2025 by 5 PM**
Date and Time for opening the Tenders : **03.10.2025 at 10.30 AM**
Venue for opening the sealed Tenders : **JC Chamber**

Addl. DME / Superintendent
Govt. General Hospital
Kadapa.

Sd/- Joint Collector / Chairman
District Purchase Committee
Kadapa.

ఎస్పీని ఆహ్వానించిన ఆర్యవైశ్యులు

మైదుకూరు రూరల్,సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన ఆర్యవైశ్యులు జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌ను మంగళవారం కలిసి .దసరా ఉత్సావాల ఆహ్వాన పత్రిక అందించి ఆహ్వానించారు. ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు చెన్నకేశవ ప్రసాద్, వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య,సెక్రటరి పుట్టా శివ, అశోక్ కుమార్ తదితరులు ఉన్నారు.







classified ఆంధ్రజ్యోతి lines

CHANGE OF NAME

★ I, **SHAIK MOHAMMED ISMAIL** (old name), S/o SHAIK KAREEMULLA, residency of 41/563, SHANKARAPURAM, kadapa Dist, A.P-516002. India, Have changed my name to **SHAIK MOHAMMAD ISMAIL** (new name) AJH-003391

★ I, **SHAIK AAMATUR RAHIMAN** (old name), W/o SHAIK KAREEMULLA,residency of 41/563, SHANKARAPURAM, kadapa Dist, A.P-516002. India, Have changed my name to **SHAIK AMATUR RAHAMAN** (new name) AJH-003392

★ I, **SHAIK AMTHU RAHIMAN** (old name), W/o SHAIK KAREEMULLA, residency of 41/563, SHANKARAPURAM, kadapa Dist, A.P-516002. India, Have changed my name to **SHAIK AMATUR RAHAMAN** (new name) AJH-003393

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మాదబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్‌క్యాష్,షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డ్ పోలీస్ డిపార్టుమెంట్)గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర: **7382114647.**

AJA- 246718

CHANGE OF NAME

I, KAPPACHA MOHAMMED ZUHER, S/o KAPPACHA SHABBIR HUSSAIN, M/o Kappacha Bashirunnisa, R/o 21/551, K.H.M. Street, Proddatur, Y.S.R. District, have changed my name to SHAIK KAPPACHA MOHAMMAD ZUHER, S/o SHAIK KAPPACHA SHABBIR HUSSAIN, M/o SHAIK KAPPACHA BASHEERUNNISA.

AJT -1659

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

లోకపావనికి నీరాజనం

- ప్రత్యేక అలంకరణలో భక్తులను కటాక్షిస్తున్న జగజ్జననీ
- దసరా ఉత్సవాల్లో అమ్మవారి దర్శనానికి బారీగా తరలివస్తున్న భక్తులు
- విద్యుత్‌కాంతులతో వెలుగుతున్న ఆలయాలు


వేంకటేశ్వరస్వామి ఆలయంలో భవాని అలంకారం


చెన్నకేశవ స్వామి ఆలయంలో ధాన్యలక్ష్మిగా..


ప్రొద్దుటూరు శివాలయంలో మంగళగౌరి



ముక్తిరామలింగేశ్వర ఆలయంలో భవానిదేవి


జమ్మలమడుగు గాయత్రీదేవి


మైదుకూరులో గాయత్రీదేవి


బద్వేలులో ధనలక్ష్మి అలంకారం


కాశినాయనలో భవానీదేవిగా అమ్మవారు


కొండాపురంలో గాయత్రీదేవిగా పెద్దమ్మతల్లి

ప్రొద్దుటూరు సెప్టెంబరు 23(ఆంధ్ర జ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం లోకపావని భక్తుల నుంచి నీరాజనాలు అందుకుంటున్నారు. దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు భవానీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో, రతనాల వెంకటేశ్వర ఆలయంలో, శాస్త్రినగర్‌లో రాజరాజేశ్వరీదేవి ఆలయంలో, ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు భవానీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వెంకటేశ్వర్లుపేటలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో, శివాలయంలో మంగళగౌరీ అలంకారం భక్తులను ఆకట్టుకుంది. చెన్నకేశవస్వామి ఆలయంలో ధాన్యలక్ష్మిగా అమ్మవారిని అలంకరించారు. భక్తులు ఆలయానికి చేరుకుని అలంకారాలను తిలకించి భక్తిశ్రద్ధలతో మొక్కుకున్నారు.

ఎర్రగుంట్లలో: మెయిన్‌బజార్‌లోని వాసవాంబ మంగళవారం భవానిదేవి అలంకారంలో భక్తులను కటాక్షించారు. ఏరువాకగంగమ్మ ఆలయంలో అమ్మవారికి రాజరాజేశ్వరీదేవిగా, చౌడేశ్వరీ దేవి ఆలయంలో బాలాత్రిపురసుందరీదేవిగా, మహాఅంకమ్మ అమ్మవారు గాయత్రీదేవిగానూ దర్శనమిచ్చారు. ఐసీయల్ కాలనీలో పార్వతీదేవికి, దుర్గాదేవికి పూజలు నిర్వహించారు.

జమ్మలమడుగులో: దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలలో రెండో రోజు మత్కన్యకాపరమేశ్వరీ దేవి గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే కన్నెతీర్థంలోనిబాలత్రిపుర సుందరీదేవి అమ్మవారు కాత్యాయని దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవగుడి లోని తలకంఠీశ్వరస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి దంపతులు అమ్మవారికి పూజలు నిర్వహించారు.

మైదుకూరు రూరల్‌లో :పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి అమ్మవారిశాలలో దసరా ఉత్సవాలలో భాగంగా మంగళవారం గాయత్రిదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బల్లాని చెన్నకేశవ ప్రసాద్ వారి నూతన కార్యవర్గం వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు.

పోరుమామిళ్లలో: దశరా శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు మంగళవారం రాత్రి పోరుమామిళ్లలో వాసవీ కన్యకాపరమేశ్వరి గాయత్రిదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు విరివిగా పాల్గొని పూజలు చేశారు.

దువ్వూరులో: దువ్వూరులో కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో మంగళవారం అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు సాక్షాత్కరించారు. ఆలయ కమిటీ పెద్దలు లింగం పట్టాభి, ఆరవేటి రవి, ఆరవేటి సుబ్బారావు, వీవీ స్వామి, రామకృష్ణ పర్యవేక్షించారు.

ఖాజీపేటలో: ఖాజీపేటలోని మత్కన్యకాపరమేశ్వరీదేవి దేవాలయంలో దసరా పురష్కరించుకుని రెండవ రోజు దీక్షాబంధన్ అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు .

కాశినాయనలో: శరన్నవరాత్రి ఉత్సవాలల్లో భాగంగా మంగళవారం నర్సాపు లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు భవానీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

కొండాపురంలో: మండలంలో దేవి నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మండలంలోని దత్తాపురం పెద్దమ్మ గుడిలో రెండో రోజు మంగళవారం గాయత్రీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

బద్వేలుటౌన్‌లో: దేవి శరన్నవరాత్రులు రెండో రోజు అమ్మవారు రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కోదండరామస్వామి ఆలయంలో కూర్మావతారంలో, మహాలక్ష్మి ఆలయంలో ధనలక్ష్మిగా, వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయంలో, వీరభద్రస్వామి ఆలయంలో రాజేశ్వరి దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

యువత ఉపాధి అవకాశాల కోసం కృషి

మైదుకూరు రూరల్,సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎపీఐడీసీ డైరెక్టర్ పందిటి మల్హోత్ర తెలిపారు. ఏపీ సచివాలయంలో మంగళవారం ఏపీఐడీసీ ఎండీ రఘునాధ్‌తో మైదుకూరుకు చెందిన రాష్ట్ర ఏపీఐడీసీ డైరెక్టర్ మల్హోత్ర తో పాటు మరికొందరు డైరెక్టర్లు రాష్ట్ర పారిశ్రామికశాఖ మంత్రి టీజీ భరత్‌తో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి కొత్త పరిశ్రమల ద్వారా యువతకు ఉపాధి కల్పించాలని, అందుకు డైరెక్టర్ల అందరూ కృషి చేయాలని మంత్రిని కోరినట్లు మల్హోత్ర తెలిపారు.


మంత్రి టీజీ భరత్‌తో ఏపీఐడీసీ డైరెక్టర్లు

వైభవంగా నవరాత్రిఉత్సవాలు

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 23 (ఆంధ్ర జ్యోతి): కాలజ్ఞాన కర్త శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం పూర్వపు మఠాధిపతి జ్యేష్ఠ పుత్రుడు వెంకటాద్రిస్వామి, ఈశ్వరీదేవి పీఠాధిపతి వీరశివకుమారస్వామి వారు దేవస్థానంలో వైభవంగా నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమాలన్నీ దేవదాయశాఖ కమిషనర్ ఆధ్వర్యంలో దేవస్థాన మేనేజరు ఈశ్వరయాచారి పర్యవేక్షణలో ఘనంగా నిర్వహిస్తున్నారు.

వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో
మండల కేంద్రంలోని వాసవీకన్యకా పరమేశ్వరి దేవాలయంలో మంగళవారం శారదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. అధ్యక్షుడు అయ్యవు వెంకటసురేశ్‌బాబు, కార్యదర్శి సురేశ్‌బాబు, కోశాధికారి దుగ్గిశెట్టి వెంకటేశ్వర్లు, యువజన సంఘః అధ్యక్షులు యాదాళ్ల వెంకటసుబ్బయ్య, కమిటి సభ్యుల ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు.



యూరియా అధికంగా వాడితే నష్టాలే..

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పంటలకు అధికంగా యూరియా వాడితే నష్టాలు తప్పవని వ్యవసాయ సంచాలకుడు ఏవీ నరసింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎర్రగుంట్ల మండలంలోని కలమల్లలో ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడుతూ పంటలకు యూరియా అధికంగా వాడటం వల్ల భూసారం తగ్గి పంటల్లో చీడపీడల సమస్య అధికమవుతుందన్నారు. ఏవో సుజనకుమారి మాట్లాడుతూ పంట సాగుచేసిన ప్రతి రైతు కూడా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. అటువంటి వారికే ప్రభుత్వ పథకాలైన నష్టపరిహారం, కనీస మద్దతుధర, పంటల బీమా వర్తిస్తాయన్నారు.

పంట నమోదు చేయించుకోండి

బి.కోడూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు పంట నమోదు ఈ నెల 30లోపు చేయించుకోవాలని వ్యవసాయాధికారి కౌశిక తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ఆనంవారిపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులు వేసిన వరి పంటను పరిశీలించారు. యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. మున్నెల్లి గ్రామ పంచాయతీలో రైతు సేవా కేంద్రంలో యూరియా అందుబాటులో ఉందని, అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయా విస్తరణాధికారి షణ్ముఖ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ

రాజుపాలెం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని టంగుటూరు గ్రామంలో మంగళవారం స్మార్ట్ రేషన్‌కార్డులను యు.టంగుటూరు సొసైటీ చైర్మన్ ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో ప్రజలకు పంపిణీ చేశారు. మండలంలో 23 రేషన్‌షాపులకు గాను 9528 స్మార్ట్‌కార్డులను ప్రజలకందించినట్లు ఆర్ఐ హుసేన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యనిర్వహణాధికారి జగన్మోహన్‌రెడ్డి, వీఆర్వో సరళ, పంచాయతీ సెక్రటరీ బాబు తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు రుణాలు

జమ్మలమడుగు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి స్వాధీనిధి పథకం కింద చిరువ్యాపారులకు, వీధి వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం రుణాలు అందిస్తోందని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి సూచించారు. మంగళవారం జమ్మలమడుగు తహసీల్దారు కార్యాలయ ఆవరణలో పీఎం స్వాధీనిధి పథకం సంబంధించి చిరువ్యాపారుల లోక కల్యాణ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా వీధి వ్యాపారులకు బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు, కుటుంబ సభ్యుల ఎంపిక కార్యక్రమం జరిగింది. అనంతరం పీఎం స్వానిధి ద్వారా మంజూరైన చెక్కులు, డిజిటల్ పేమెంట్ స్కానర్లు, ఐడీ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటరామిరెడ్డి, మెప్మా ఆర్పీలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మెప్మా కోఆర్డినేటర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

పదవుల కేటాయింపుల్లో న్యాయం చేయండి


ప్రొద్దుటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పదవుల కేటాయింపుల్లో ప్రొద్దుటూరు నియోజకవర్గానికి న్యాయం చేయాలని ఎమ్మెల్యే వరద రాజులరెడ్డి టీడీపీ రాష్ట్రఅధ్యక్షుడు శ్రీనివాసరావును కోరారు. మంగళవారం రాజధాని అమరావతిలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావును ఎమ్మెల్యే వరదకలిసి ప్రొద్దుటూరులో సంస్థాగతంగా చేప ట్టిన పార్టీ పదవులపై చర్చించారు. అలాగే జిల్లా పార్టీ పదవుల్లో రాష్ట్ర కమిటీలో ప్రొద్దుటూరులోని సీనియర్ నేతలకు ప్రాధాన్యత కల్పించాలన్నారు.

స్పెషలిస్టుల సేవలు వినియోగించుకోవాలి

ప్రొద్దుటూరు,సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాల్లో స్పెషలిస్టు వైద్యుల సేవలు వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్‌లో స్వస్తనారీ స్వశక్తి పరివార్ అభియాన్ పేర ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కుటుంబంలో మహిళలు ఆరోగ్యం గా ఉంటే అందరు ఆరోగ్యవంతులవుతారన్నారు. ఈసందర్భంగా 200 మందికి ఉచితంగా వైద్య సేవలుఅందించారు. కార్యక్రమంలో డాక్టర్ తేజస్విని, డాక్టర్ కిరణ్, డాక్టర్ రఘునాధ రెడ్డి, డాక్టర్ పవన్‌కుమార్ అప్తామాలిస్టు రఘురామిరెడ్డి, కౌన్సిలర్ జిలాన్, టీబీ సూపర్‌వైజర్ రాజారత్నం పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో స్వస్థనారీ సశక్తిపరివార్

మైదుకూరు/రూరల్, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి):మైదుకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మంశవారం ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ జ్యోత్స్నరెడ్డి ఆద్వర్యంలో స్వస్థనారీ సశక్తి పరివార్ కార్యక్రమం నిర్వహించారు. డీడీ ఎంహెచ్‌వో డాక్టర్ మల్లేష్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరక్టర్లు యాపరాల చిన్న, రమణ, బీజేపీ జిల్లా ఉపాద్యక్షుడు మాచనూరు సుబ్బరాయుడులు ముఖ్య అతిదులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరక్టర్ యాపరాల చిన్న రక్తదానం చేశారు. మహిళలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకంలో మహిళలకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ పథకం మహిళలకు ఒక వరం లాంటిదన్నారు.









13 గంటల పనివిధానం వద్దు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పనిచేసే ప్రదేశాల్లో 13 గంటలు పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయకుమార్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎంతో మంది కార్మికులు ప్రాణత్యాగం చేసి 8 గంటల పని విధానం సాధించారని నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

వడ్డీవ్యాపారుల సెల్‌ఫోన్లు తనిఖీ

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) :ప్రొద్దుటూరు లో వడ్డీ వ్యాపారీ వేణుగోపాల్ రెడ్డి దారుణ హత్య తరువాత పోలీసులు అప్రమత్తమయ్యారు. పట్టణంలోని పలు పోలీసు స్టేషన్లపరిధిలో పలువురు వడ్డీవ్యాపారులను పిలిపించి వారి సెల్‌ఫోన్లు పరిశీలించారు. ఈ సందర్భంగా అధిక వడ్డీలకు అప్పులిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.





ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలను పురష్కరించుకుని ఆలయాల పరిసరాలను, కాలువలను శుభ్రపరచాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డిని ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఇర్ఫాన్ బాష కోరారు. ఆ మేరకు మంగళవారం కమిషనర్‌కు ఆయన వినతి పత్రం అందజేసి మాట్లాడుతూ దసరా ఉత్సవాలను ప్రొద్దుటూరు పట్టణంలో వైభవంగా నిర్వహిస్తారని దీంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు.

